కథ :

# వెలి

కాలువ మల్లయ్య

అంబటాళ్ళయింది. సైకిలోల్లనుతీసుకొని పటేలప్పలు సేండ్లల్లకు పోతన్రు. మక్క పెరండ్లల్ల కలుపుమొక్కలు దున్నుటానికి కాపుదనపోళ్ళు నాగండ్లను కాండ్లకు తిర్రిమర్రిగట్టి ఎడ్లతోని నడిపించుకపోతన్రు. పసులపోరగాండ్లు గొడ్లను మేపుటానికి సెలుకల్లకు తోలుకపోతండ్రు. అచ్చేపోయే సందడిలో బజారంతా గడబిడగా ఉంది.

సుక్కల్లోసెందుర్రిల్లా చిన్నచిన్న పెంకుటిళ్ళనడుమ ఆఊరిదొర, సర్పంచు ఐన భూంరావ్‌గారి మేడ. ఆమేడచుట్టూ విశాలమైనస్థలం, దాంచుట్టూ పెద్దపహారీ గోడ. ఆ గోడవతల బజారు. ఆబజార్లో మూలగాఒకగద్దె. ఆగద్దెపై పరిచినచాపలో ఆసమయంలో దొరకూర్చున్నడు. అతనికి ఓపక్క పోలీసుపటేలు, ఓపక్క పట్వారి కూసున్నరు. గద్దెమీదనే చాపబయట కొందరు ఊరిపెద్దలు కూసున్నరు. గద్దెకింద ముంగాళ్ళమీదకొందరు తెనుగోళ్ళు కూసున్నరు. గద్దెకిందనే గద్దెపట్టుకొని తెనుగోళ్ళ కులపెద్ద దొంగసూపులుసూత్తా కూసున్నడు. గద్దె సుట్టుపక్కల పంచాయతీ వినడానికొచ్చిన జనంతోనిండిఉంది, గద్దెనానుకొనివున్న వేపచెట్టును పట్టుకొని నర్సయ్య విచారంగ నిల్చున్నడు. అతనిముఖంలో ఆందోళనఉంది. భయంఉంది. ఏమౌతుందోనన్న ఆతురతఉంది. దైన్యంతాండవిస్తుంది. అసహనంగా అటు ఇటు కదులుతూ, మాటిమాటికి దొరవైపుచూస్తూ నేలకు ముఖంవేలాడేసుకుంటూ, దొర మాటకై ఎదిరిచూస్తున్నడు, వేపచెట్టు సమీపంలోఉన్న కరెంటు స్తంభందగ్గర నర్సయ్య కూతురు మల్లవ్వ నాలెకుమొకమేసుకొని భూదేవిలో లీనమయినట్లుగాఉంది. ఆమెముఖంలో ఆవేశం, క్రోధం, దుఃఖం, అవమానంతోకలిసిన భావాలు ద్యోతకమౌతున్నయి. ఆమె ఏమీచేయలేని నిస్సహాయురాలివలెవుంది. మల్లవ్వ కొంగు పట్టుకొని ఆమె ఆరేళ్ళకొడుకు రాజేశం మట్టిపెళ్ళ చేతిలోకితీసుకొని అటు ఇటు తిప్పుతూ కూసున్నడు. వాడు మాటిమాటికీ గద్దెవైపు చూస్తూ బిక్కు బిక్కుమంటున్నడు. గద్దెకు ఇంకోపక్కన రాజయ్య నిర్లక్షంగా, పొగరుగా ఐదారుగురు స్నేహితులతో నిల్చున్నడు. అతనిముఖంలో చురుకుదనముంది. దేనినైనా సాధించవచ్చుననే ఆత్మవిశ్వాసముంది. తానేమాత్రం తప్పుచేయలేదన్న భావముంది. ఏమైనాసరే ఎదుర్కొగలనన్న ధీమావుంది.

దొర బర్కిలీసిగరెట్టు దమ్ములాగి సరాయించిండు. పెద్దమనుషులవైపు తేరిపార జూసిండు. సూపును నర్సయ్య దిక్కు తిప్పిండు. "నర్సిగా! నీమీద నీ కులపెద్ద పిర్యాద్జేసిండు. నీ బిడ్డజేసిన పనేందిర గిట్లెక్కన్నన్న ఉంటాదిర" అన్నడు. జనం, పెద్దమనుషులు నర్సయ్య దిక్కు జూసిండ్రు. నర్సయ్యేం మాట్లాడలేదు. ఇంతలో "ముండబొడ్డికి మొగడు గావల్సొచ్చినాదిర. దీని కాపురంగాక పోతె" అన్నడు పోలీసుపటేలు.

నర్సయ్య ఏం జవాబు చెప్పలేదు. ఏం జవాబు చెప్పన్నా అని ఆలోచిస్తుండు. మల్లవ్వ ముఖాన్ని మరింత నాలెకేసుకుని కూసున్నది. రాజయ్య కోరమీసాలను మెలిపెడుతూ నిల్చున్నడు.

"అయా! కలీగం మునిగిపొమ్మంటె మునిగిపోదా యిగ. ముండబొడ్లు కడుపుల్జేసుకుంటె అసలు గొట్టుమంటె ఎట్లగొడుతయ్. దొర గిదీనికి పెద్దశిచ్చే ఎయ్యాలె. లేపోతే అన్నాలమైపోతది." అన్నడు కులపెద్ద. అయినా నర్సయ్యజవాబు చెప్పలేదు. ఏం జవాబు చెప్పన్నా అని గుణాయించుకుంటున్నడు.

"ఏందిర నర్సిగ బెల్లంగొట్టిన రాయోలె మాట్లాడుతలేవు ఇనపడ్త లేదుర." అన్నడు పట్వారి.

నర్సయ్యలేచి జవాబు చెపుతామని తయారౌతున్నడు. ఇంతలో మళ్ళీ దొరే అన్నడు.

"ఇంతమంది సెప్పినా ఇనవడ్తలేదుర- నువ్వేం సమదసం సెప్పుకుంటవో సెప్పుకో"

నర్సయ్య నెత్తిమీది రుమాలుతీసి సేతిలపట్టుకున్నడు. దొర కెదురుగనిల్చున్నడు "ఏం జెప్పాలె బాంచెను" అన్నడు.

ఏం జెప్పన్నని సంసారోలె మాట్లాడుతున్నవేందిర. పోర్ని జెన్నకిడసిపెట్టి ఏమెరుగనట్టు మాట్లాడుతవేందిర" అన్నడొక పెద్దమనిషి.

"గట్లంటెట్లరో నువ్వేం జెప్పకుంటె మేం జెప్పిందాని కొప్పుకుంటావుర. మల్ల మాట్లాడద్దు మరి" అన్నడు పట్వారి.

"గట్లైట్లయిద్ది బాంచెన్- కాని గిందేం తప్పుందో నాకయితెతెల్తలేదు". అన్నడు నర్సయ్య

“సెప్పులోని కొట్టనుండె గాడిదికొడుకుసు. నీ బిడ్డ సక్కటిపనే సేసిందని మాట్లాడుతున్నావుర” అన్నడు వేరొక పెద్దమనిషి.

“సక్కటిపని సేసిందని నేనంటన్నన బాంచెను. కాని దానీదెంత బాంచెను. మాందె ఇరువైరొండేండ్లు. సిన్నప్పుడే పోరడుపుట్టిండు. ఇరువయేండ్లకే ముండ మోసె. అప్పట్నుంచి బతికినన్నిగాలాలు అదట్లనే ఉండన్నా బాంచెను. సెప్పుండ్రి దొరా సెప్పుండ్రి” అన్నడు సర్వయ్య దీనంగా.

“గదేందిరో వీరేశలింగమోలె మాట్లాడుతవ్. బతుకంత గట్లనే ఉండమని ఎవలన్నరు. కాని మొగన్లేకుండ కడుపుజేయించుకునుడేందిర. గిది తప్పుగాదుర” అన్నడు దొర.

దొర మాటలు ఒకరిద్దరు పెద్దమనుషులకు బాధగలిగించినయి. మల్లవ్వ కన్నీళ్ళు కార్చుకుంటూ కూసున్నది.

“తప్పేగావచ్చు బాంచెను. అయిసులున్నపోరి ఏదో కాల్జారింది. అదేంకులం గానోనితోని పోలేదుగద. యూడాడినుంచి దీన్ని రాజిగాని కిత్తమని అనుకోనేవద్దిమి. ఇది అందరికి తెల్వొందేనాయె. ఆడుగూడ లగ్గంజేసుకుంటాననవట్టె. ఇంక పంచాతెందుకు బాంచెను. కావల్తె ఇక్కన్నే ఉన్నడుగద రాజిగాడు. అన్నడుగిండ్రి.” అన్నడు సర్వయ్య.

“నిజమే దొర మల్లిని రాజిగానికి మారుమానం ఇత్తనన్నదేనాయె. సర్విగాని కెళ్ళక లగ్గంసేయలేదు. ఇంతల్నే పోరగండ్లు కాల్జారిండ్లు. అళ్ళకాళ్ళకు అంటగడ్తె ఐపాయె.” అన్నదొక పెద్దమనిషి.

దొర ఆ పెద్దమనిషి దిక్కు ఉరిమిచూసిండు. ఆ పెద్దమనిషి తలవంచుకొని నేలసూపులు సూడబట్టిండు.

రాజయ్యను సూత్తెనే దొరకు, దొరతాబేదార్లకుభయం. వానికోరమీసాలు, వాడిచూపులు, నిర్లక్ష్యం ఆ ఊళ్ళోని పెద్దోళ్ళకు కొరకరాని కొయ్యలాంటివి. మొదలేవాని పొగరుబోతు. దానికితోడు పక్కవూళ్ళోనూ, అపుడపుడు ఆ వూళ్ళోకి వస్తూ దొరల దోపిడీగురించి, అన్యాయాలగురించి సంఘపోళ్ళు చెప్పేమాటలతో వాడు మరింత రాటుదేలుతున్నాడు. రాజిగాన్నేమన్నా అంటే కోడెగాళ్ళలాంటి సోపతిదార్లతో ఎదురుతిరుగుతడేమోనని దొర భయం. మునుపటితీరుగ హుకుంచెలాయించి బెదిరిత్తే ఇనేటట్టులేరు. అందుకనే మెత్తగున్నట్టేవుండి సర్విగాన్నే బెదిరించి వెలివేసి

దండుగ గుంజాలని దొర ఆలోచిస్తండు. దొర నర్సిగాడు రాజిగాన్నుతగుమన్నాగాని రాజిగానిదిక్కు చూడనేలేదు, నర్సయ్యనుద్దేశించే అన్నడు.

"కండ్లునెత్తికెక్కినాయిర తెనుగోడ. కులకట్టని, నీతినియమాలని ఉండద్దుర. ఎవలిష్టమచ్చినట్టు ఆళ్ళు లగ్గంగాకముందు, ముండబొట్లయినంక కడుపుల్జేసుకుంటె నాయమెక్కడుందిర, బాక్రాపురమచ్చింది, దొంగ...." ఏవో బూతుమాటలు తిట్టిండు. దాని తోవెంటబోతున్న కైలికోడెవేసిన రంకెలో ఆతిట్లు కలిసిపోయినయి.

రాజయ్యకు ఆవేశం ఉరకలువేస్తుంది. మాటిమాటికీ ముందుకు పోతున్నవాన్ని స్నేహితులాపుతున్నారు. స్నేహితులను దొబ్బుకొని ముందుకుపోబోయిండు. కాని ఇంతలో నర్సయ్యే మాట్లాడిండు.

నర్సయ్యకు దొర తిట్లతో కొంచెం కోపమచ్చింది. తెగినబొక్కెన నూతిల్దాక. మంచిగనే మాట్లాడాలనుకున్నడు.

"కాద్దొర నాకు తెలువకడుగుత. మేమ్మెం గంగలపడినస్తం. మేమ్మెకు పిరాజ్జెయ్యలేదుగద ఎందుకు బాంచెను మమ్ముల కాల్చుకతింటరు. మా సందాన మమ్ముల బతుకనియ్యరు. కడుపయ్యింది నా బిడ్డకు, కడుపుజేసినోనికి పెండ్లమే లేదాయె. ఆళ్ళిద్దరికి లగ్గంనిచ్చయమెఅయె ఇంక గీళ్ళందరు, గీ పంచాతులన్నెందుకో సముజయితలేదు".

"నర్సిగ బాగా దూరమె పోతున్నవేంరో బలుపార" పట్వారి అన్నడు.

"ఇట్టమున్నట్టు మాట్లాడుతన్నవ్. ఇది పంచాతా ఏంటిదిరగాడ్దికె" పోలీసు పటేలు అన్నడు.

"నువ్ పిరాజ్జెయ్యకుంటేందిర. నీ పెద్దకులపోడు జెప్పిండు. ఆదేకద మీ యవ్వారమంత చూసేది లం....కొడుక నీకు బాగమత్తచ్చింది." దొర ఆవేశంగా అన్నడు.

ఇక రాజిగానికెంత ఆపుకుందామన్నా ఆవేశం ఆగలేదు. దొర ముందు కచ్చిండు. కులపెద్దదిక్కు చూసిండు. దొరనుద్దేశించి "ఆ లంజెకొడుకెవడు మా సంగతుల్జెప్పటానికి, తాగినోడుగట్టై తాళ్ళపన్నవి మేం తప్పుచేసుకుంటె మేమ్మెం నూసుకుంటం. నడుమ గానికేందట" అన్నడు ఆవేశంగా.

రాజిగాని మాటలువిన్న దొర ఖంగుతిన్నడు. యువకులంతా చప్పట్లుగొట్టిండ్రు. పట్వారి, పోలీసుపటేలు, కుల[illegible] ...... [illegible]మనలేదు.

సక్కల్లాకూర్చున్నరు. ఒకరిద్దరు పెద్దమనుషులకు ఆ మాటలు సంతోషం కలిగించి నయ్. కాని వాళ్ళు దొరకెదురు మాట్లాడలేరు. తుదకు దొరే అన్నడు.

'రాజిగా ! నేను నీతోని మాట్లాడుతలేను' నువ్వ నప్పుడుజేకుండు" అని పెద్ద మనుషుల దిక్కు తిరిగి "నలుగురున్నకాడ నాయముందంటరు. మీరేంజెయ్యమంటె అజ్జేత్త సెప్పుండ్రి; అన్నడు.

"నర్సిగానింటికి సాకలోన్ని, మంగలోన్ని బందుజేయాలె" పోలీసుపటేలు.

"నర్సిగాన్ని కులంలనుంచి ఎల్లగొట్టాలె" పట్వారి,

"నర్సిగానికి దండుగెయ్యాలె" ఒక పెద్దమనిషి· నానా విధాలుగాచెప్పి తుది నిర్ణయాన్ని దొరకే వదిలిపెట్టిండ్రు.

"పెద్దమనుషులందరి నిర్ణయాన్నిబట్టి సెప్పుతున్న. దీని కందరు కట్టుబడి ఉండాలె. నర్సిగా ! ఇసోంటి యిడిసిపెడితె కట్టులేకుంటపోతది. నిన్ను కులంనుంచి వెలేస్తున్నం. నీ ఇంటికి సాకలోడు, మంగలోడు బందు. కులపోళ్ళుగూడరారు. అచ్చినోనికి ఇన్నూరురూపాయల దండుగ" అన్నడు దొర.

ఆ తీర్పు అక్కడున్న కొందరు దొర చంచగాళ్ళైన పెద్దమనుషులకు తప్ప చాలమందికి నచ్చలేదు. ఆ తీర్పు అన్యాయమని అందరికీ తెలుసు. ఇలాంటి తీర్పు లెన్నోవాళ్ళు చూసిండ్రు. నడిపించే వాళ్ళెవరైనా ఉంటే వాళ్ళెదిరించడానికి సిద్ధంగా ఉన్నరు.

రాజయ్య కళ్ళు చింతనిప్పులయినయి. వానిస్నేహితులుకూడా ఆవేశంగానే ఉన్నరు· ఐనా ఏంజరుగుద్దో చూద్దామని ఎదిరిచూస్తున్నరు. ఆవేశంతో ఏదోమాట్లాడ బోయిన రాజయ్యనాపి నర్సయ్య "నువ్వాగెర రాజిగ- నేమ్మాట్లాడుత, కట్టిరిసినట్లు మాట్లాడుతెట్లర" అని "దొరా గట్లయితెట్లబాంచెను. మీరే ఆదుకోవాలె, గులాపోన్ని" అని దొరకాళ్ళు, పట్వారి, పటేలు, కులపెద్దలకాళ్ళు పట్టుకున్నడు. తన యువ మిత్రులతో రాజిగాడు అండగాఉన్నా తరతరాల బానిసత్వం నర్సయ్యచే ఆ పనిని చేయించింది. దొరఆశించిందికూడా అదే. వాన్ని కులంనుంచి వెలేస్తె తనకే మొక్కుతంగి ? ఈపేరున బెదిరించి దండుగగుంజాలని దొరపథకం. దొర తాబేదార్ల ప్లానుకూడాఅదే. ఎనుకటికాలమయితే రాజయ్య పొగరుబోతు మాటలకు పెద్దశిక్షేవేసే వాడు దొర, కాని కాలమెట్లనోఉన్నది. కాలంతో మారినట్లుమారి డబ్బుగుంజాలని దొరప్లాను. వచ్చినఅవకాశాన్ని విడువకూడదనుకున్నడు.

"సరేపోరా ! నీవింత బతిమలాడ్తున్నవని ఇడిసిపెడ్తున్నం. కులతప్పుకింద ఐదునూర్లు కులపోళ్ళకు, పంచాయితిబోర్డుకు ఐదునూర్లు మొత్తం వెయ్యిరూపాయల దండుగ్గట్టి కులంలకురా! అటెనుక మల్లిని రాజిగానికిచ్చి మారుమనంచెయ్యి" అన్నడు.

దొర తాబేదార్లు సంబరపడ్డరు.

ఇక రాజయ్యలో ఆవేశంఆగలేదు. సర్పయ్యను ఎనుకకుగుంజిండు," మామ! అట్లాగు. నేమ్మాట్లాడుత. ఎందుకుదొర దండుగ్గట్టాలె, ఐదునూర్లు పెద్దమనుషులకు, ఐదునూర్లతోని కులపోల్లు కల్లుదాగుతె పోయినకులమెట్లత్తది? కల్లుతోని అచ్చేకులం పోతేందుంటేంది? ఏం తప్పుజేసినమని ఎయ్యిరూపాయలియ్యాలె ఎవడో నీ బాంచెగాడు మాకుతెలువకుంట పిర్యాజ్జేత్తె మాకేంది? అన్నేకట్టుమను దండుగ. మేమేం తప్పుజేయలేదు" అన్నడు ఆవేశంగా.

పరిజల్లో కలకలం బయల్దేరింది,

"రాజిగాడుసెప్పింది నిజమే. ఏ తప్పుసేయనపుడు దండుగెందుకు గట్టాలె?"

"అది ఆడు పెండ్లిజేసుకుంటనన్నంక సడుమ గీ దొరేంది?"

"రాజిగాడు భలే మాట్లాడిండు" నానావిధాలుగా పరిజలనుకోబట్టిండ్రు. దొర మొకం నల్లబడ్డది. వేపచెట్టుకొమ్మపైనుంచి గండుచీమొకటి దొర మెడలపైబడి కసిక్కున కొరికింది. చీమను దొరకబట్టబోయిండు. కాని అది తప్పించుకొని అంగి లోపలకుజొచ్చి వీపులకుట్టింది. చేసేదిలేక బనీనువదులుచేసి దులిపేసిండు. రాజయ్య కు అనుకూలంగా పరిజలనుండి వచ్చేమాటలనువిని దొర దిక్కులుచూసిండు. తన చేతికిందబతికే సుంకరోళ్ళుకూడా సంతోషంగనే ఉన్నరు. దొర ఆళ్ళమొఖంకేసి చూసేవరకు వికారంగ మొకంపెట్టి నాలెకుమొకమేసిండ్రు. పెద్దమనుషుల మొకాల్లో రక్తంలేదు. వానితోటిపెట్టుకుంటె యువకులతోని ఎగబడుతడు. కాలంమంచిగలేదు. గాలికిపొయ్యేకంపను ఎందుకు తలుగబెట్టుకోవాలె అని మౌనంగున్నరు. దొరకు కూడ లోపల భయంగనేఉన్నది. మేకపోతుగాంభీర్యంతో "....వల్లచ్చినాయిర రాజిగ. సిన్నపెద్దభేదంలేద ! నాయం అన్నాయం సూడద్ద ?" అన్నడు.

రాజయ్య కొదమసింగంలా ముందుకొచ్చిండు. "నాయం, అన్నాయం ! పరిజలను గొర్లంజేసి ఎన్నేండ్లేలుతరురాజ్జెం. దొంగనాకొడుకు కులపెద్దనుగబైకొని దండుగలుపెట్టిత్తమంటె ఇక్కడెవ్వల్లేరు ఇచ్చుటానికి. సరే నాతప్పే, కాని పెండ్లి గాకముందే బొత్తసేసుకొని దిగదాగిన నీబిడ్డకు ఏం దండుగగట్టినవ్ ? ముండమోసి ఇంట్లుండి పాలేర్తోని సాటుమాటుగ రంకుజేస్తున్న పట్వారి బిడ్డసంగతేంది ? మీరు

జేత్తేనేమొ తప్పుగాదు, మేంజేత్తెతప్పా? మీకులాలు మీదగ్గర్నే ఉంచుకోండ్రి, రెక్కలకట్టంమీద బతికేమాకు ఏకులమైతేంది? ఏఊరైతేంది? ఏకులంలున్నా, ఏ ఊళ్ళున్నా, ఏపట్నంలున్నా మేం రెక్కలనమ్ముకొనే బతుకాలె. గట్లాంటప్పుడు నీకు దండుగట్టి కులంలకు అచ్చుడెందుకు? ఈ ఊరుగాకుంటె ఇంకోఊరు, ఎక్కడున్నా మాకట్టంమాదే. ఐనా ఇక్కన్నే, ఈవూళ్ళనే తలకాయెగిరేసుకుంట బతుకుత ఎవ్వలడ్డమత్తరో, ఎవ్వలెలేత్తరోసూత్త" అని నర్సయ్యదిక్కు తిరిగి "రా మామా! అణిగి మణిగిఉన్నకొద్దీ గిట్లనే సవారిజేత్తరు, కులంకులమని ఇడిపోతే మనండ్ల మనకే కొట్లాటపెడ్తరు. కట్టపడి బతికెటోళ్ళది, కూలోల్లది అంతాఒకటేకులం" అని ఒకసారి అందరిదిక్కు చూసిండు. చాలామంది జనంనుంచి తనకు అనుకూలతే కనబడింది.

మల్లిదగ్గరికొచ్చిండు "రాయే మల్లి. ఎందుకు భయపడ్తున్నవు? ఏం తప్పు జేసిన్నని నాలెకు మొకమేసినవు? నాతోరా! నిన్నులగ్గంజేసుకుంట. నీకొడుకును నాకొడుకోలె సూసుకుంట"అని రాజేశంను సంకలెత్తుకొని, మల్లవ్వనొకచేత్తో పట్టుకొని దర్పంగా, పొగరుగా అడుగులేస్తూ పోసాగాడు రాజయ్య. ప్రజలందరూ అతడితో పాటే లేచి ఇండ్లకుబయలుదేరిండ్రి.

చెట్లపై ఉడుత కిచకిచమన్నది. దొర, దొరచెంచాల ముఖాలు కందెనమసి పూసినట్టుగా తయారయినయి. చాలాసేపటికి తేలుకుట్టిన దొంగల్లా నెత్తిపై బట్టలేసుకొని ఇంటిదారి పట్టిండ్రి.

---

వెలువడింది

## నక్సల్బరీ వెలుగులో (భారతదేశ నక్సలైట్ ఉద్యమ చరిత్ర)

ఆంగ్లమూలం : సుమంతా బెనర్జీ

తెలుగు : కృష్ణమూర్తి

వెల : 24-00 రు.

వివరాలకూ, ప్రతులకూ :

సామ్యవాద సాహితి, 16-2-145/8/3 జడ్జెస్‌కాలనీ వెనుక
న్యూమలక్‌పేట, హైదరాబాద్ - 500 036.

1. సృజన, హనమకొండ - 506 001
2. పీస్‌బుక్‌సెంటర్, 4-5-421 సుల్తాన్‌బజార్, హైదరాబాద్ - 500 001.
3. నవయుగ బుక్‌హౌజ్ సుల్తాన్‌బజార్, హైదరాబాద్ - 500 001.

వద్ద కూడా కాపీలు దొరుకును.